నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

డీఎంహెచ్ఓను కలిసిన వైద్య ఉద్యోగుల సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్‌ను ఆయన కార్యాలయంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ వైద్య ఉద్యోగుల సంఘం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాథోడ్ బాబూలాల్, సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

అధికారులు సమన్వయంతో పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న, కొత్తగా జరిగే అభివృద్ధి పనుల నివేదికలు తమకు ఇవ్వాలని, సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. అధికారులు సైతం ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడాలని సూచించారు.



పిడుగుపాటుకు బాలుడు మృతి



నవతెలంగాణ-సారంగాపూర్

పిడుగుపాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దర్గానగర్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. జాదవ్ పండిత్ ఉదయం గ్రామ శివారులో గల తన చేనులో చదును చేసేందుకు వెళ్లాడు. పండిత్ భార్య సరిత భర్త కోసం భోజనం తీసుకెళ్లింది. కొడుకు జాదవ్ కృష్ణ(14) సైతం ఆమె వెంట వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం చేనులోనే పని చేస్తున్నారు. 3గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడింది. దీంతో కృష్ణ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

బోథ్ : మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన చవాన్ గురునాథ్‌కు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. శుక్రవారం పశువుల పాక వద్ద చెట్టు కింద రెండు ఆవులను కట్టి ఉంచారు. సాయంత్రం సమయంలో భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో ఆవులు మృతి చెందాయి. వాటి విలువ దాదాపు రూ.60వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

పోడు రైతులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-ఇచ్చోడ

పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని, కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం, బాజీపేట్, గుండాల, సిరిచెల్మ గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలుసుకుని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి భూములను పరిశీలించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూముల్లో కందకాలు తవ్వటాన్ని ఆపాలని అటవీ అధికారులకు సూచించారు. ఏ సమస్య ఉన్న గ్రామ ప్రజల సమక్షంలో కమిటీలతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. సమస్యను జఠిలం చేసుకోవడం మంచి పద్ధతి కాదని అధికారులకు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందని, ప్రజలకు అనుకూలంగా అధికారులు, నాయకులు సహకరించాలని తెలిపారు.

విద్యావాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో పనిచేసిన విద్యావాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని విద్యావాలంటీర్ల సంఘం నాయకులు కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ ప్రణీతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య అందటం లేదని పేర్కొన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, నర్సింగ్, రాంకిషన్, బాలకిషన్, గజానన్, చరణ్‌సింగ్, లక్ష్మి ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ శివారు ప్రాంతాలలో మూడు వాహనాల్లో 106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బి.ప్రశాంత్‌రావు, ఎ.దినేష్ చంద్రారెడ్డి, డీటీ శ్రీనివాస్ తెలిపారు. నెన్నెల, కాగజ్‌నగర్ నుండి వ్యాపారి ప్రకాష్ మహారాష్ట్రకు బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాహనాలను సీజ్ చేసి కాగజ్‌నగర్‌కు చెందిన గడ్డం శంకర్‌గౌడ్, గులాం అఫ్రోజ్ అహ్మద్, శంషాద్, రమేష్, అక్బర్, నీలం రాజకుమార్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

భారీ మొత్తంలో గుట్కా పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని ఓ కిరాణ దుకాణంలో రూ.47వేలు విలువ గల గుట్కా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిర్వాహకుడు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ఏరువాక సాగాలి..కష్టమంతా తీరాలి..!

- ఉమ్మడి జిల్లాను పలకరించిన తొలకరి వర్షం
- విత్తులు నాటేందుకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- ఊరూరా ప్రారంభమైన ఖరీఫ్ సందడి
- విత్తనాలు, పరికరాల కొనుగోళ్లతో మార్కెట్లకు కళ
- ఖరీఫ్ ప్రణాళికను ఖరారు చేసిన అధికారులు

ఏరువాక సాగారో..అన్నా..రైతన్న..నీ కష్టమంతా తీరెనురో అన్నా..చిన్నన్న అనే పాట గుర్తుంది కదా..ఏన్నేండ్లయినా ఈ పాట ఇప్పటికీ రైతులు గుర్తు చేసుకుంటారు. పొలం పనుల్లో నిమగ్నమవుతూ హుషారుగా ఈ పాట పాడుతూ పనులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాలు జిల్లాను తాకడం..తొలకరి వర్షం..అన్నదాతలను పలకరించడంతో ఏరువాక పనులు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే కొన్ని పొడి నేలల్లో విత్తనాలు వేయగా.. తడి నేలలను సిద్ధం చేస్తున్నారు. మరో ఒకటి, రెండు వర్షాలు రాగానే విత్తేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోపక్క వ్యవసాయశాఖ సైతం ఖరీఫ్ ప్రణాళికను రూపొందించింది. జిల్లాల్లో సాగయ్యే పంటలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు, ఇతర రసాయనిక మందులను అందుబాటులో ఉంచింది. ఇప్పటికే విత్తనాలు కొనుగోలు కొనసాగుతుండగా.. రైతులంతా పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పల్లెల్లో వ్యవసాయ పనులు.. పనిముట్లు, ఇతర పనుల కోసం రైతుల రాకతో పట్టణాల్లోనూ సందడి వాతావరణం కనిపిస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికశాతం మందికి వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఖరీఫ్‌లోనే అధికంగా సాగవడంతో పాటు వర్షాధారం మీదనే ఆధారపడి పండిస్తుంటారు. తాజాగా మృగశిరకార్తె రాగానే రైతులు ఖరీఫ్ సీజన్‌ను ప్రారంభిస్తుంటారు. ఇప్పటికే దుక్కులు పూర్తిచేసిన నేలను సిద్ధం చేసిన రైతులు వానలు వస్తాయనే నమ్మకంతో విత్తనాలు విత్తటం ప్రారంభించారు. చాలా చోట్ల పొడి నేలల్లో విత్తనాలు వేయడం మొదలుపెట్టారు. తడి నేలలు కలిగిన వారు ఒకటి, రెండు భారీ వర్షాల కోసం వేచిచూస్తున్నారు. ఎండల ప్రభావం కూడా తగ్గిపోవడంతో రైతులు పొలం బాటపట్టారు. ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేయగా.. ఎరువులు, ఇతర రసాయనిక మందులను అందుబాటులో ఉంచుకుంటున్నారు. కొంగొత్త ఆశలతో ఖరీఫ్‌కు సిద్ధమైన రైతులకు తొలుత విత్తనాల కొరత వేధించినా.. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి విత్తనాలు తెప్పించడంతో కొరతను అధిగమించగలిగారు. ఇంకా అనేక మంది రైతులు విత్తన దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో పాటు వ్యవసాయ అనుబంధ పరికరాల కోసం మండల కేంద్రాలు, పట్టణాల బాటపట్టారు. గతేడాది అతివృష్టి..అనావృష్టి కారణంగా పంటల దిగుబడి రాలేకపోవడం.. మార్కెట్‌లో తగిన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కనీసం ఈ ఏడాదైనా కాలం కలిసిరావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

ఖరీఫ్ ప్రణాళిక ఖరారు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5.70లక్షల మంది రైతులు ఉండగా వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 17లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 10.44లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా 2.10లక్షల ఎకరాల్లో సోయాబీన్, మరో 1.10లక్షల ఎకరాల్లో కందులు, 3.35లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగుచేస్తున్నారు. మిగతా వాటిలో పెసరి, మినుములు, సజ్జలు, జొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 303వ్యవసాయ క్లస్టర్లు ఉండగా సుమారు 15లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు, మరో 80వేల క్వింటాళ్ల వరకు సోయాబీన్ విత్తనాలు అవసరం కానున్నాయి. వీటిని కేవలం ప్రయివేటు మార్కెట్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం విత్తనాలకు ఎలాంటి రాయితీలు ఇవ్వడం లేదు. కేవలం పచ్చిరొట్టె విత్తనాలు మాత్రమే విక్రయిస్తోంది. మరోపక్క ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో 90వేల మె.టన్నుల ఎరువులు, నిర్మల్‌లో 65వేల మె.టన్నులు, మంచిర్యాలలో 78వేల మె.టన్నులు, 73వేల మె.టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు.

వీటిని ప్రయివేటుతో పాటు మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ద్వారా విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ చెబుతున్నా.. ఉమ్మడి జిల్లా వాతావరణం ఎలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విత్తనాలు నాటుతున్న కూలీలు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

వర్షాలు కురిసిన తర్వాతే విత్తుకోవాలి : పుల్లయ్య,

జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్



వర్షాకాలం ప్రారంభం అయినప్పటికీ.. వర్షాలు సమృద్ధిగా కురిసి నేలలో 60 నుంచి 70శాతం తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలి. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చాం. విత్తన ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలి. అపరిచిత వ్యక్తుల వద్ద కాకుండా లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. ఎరువులు సైతం అవసరం మేరకు ఉన్నాయి. రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకొని పనులు చేపట్టాలి.

రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ-నిర్మల్



రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ప్రతి రైతుకు విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని అరుణ్ ఆగ్రో ఏజెన్సీస్ విత్తనాలు, పెస్టిసైడ్స్ షాప్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షాపు యజమానులు నిబంధనలు పాటించాలని, విత్తన నిల్వలు, ధరలు ప్రతి షాపులో ప్రదర్శించాలని సూచించారు. వానాకాలానికి అవసరమైన వివిధ రకాల విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. నకిలీ విత్తనాలు, అక్రమ రవాణాను నియంత్రించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో తనిఖీ బృందాలను జిల్లా, మండల స్థాయిల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్‌లను తనిఖీ చేయడం జరుగుతోందని తెలిపారు. వానాకాలం పంటల ప్రణాళికకు అనుగుణంగా సరిపడా పత్తి, మొక్కజొన్న, సోయా, కంది ఇతర పప్పు దినుసుల విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని, అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రశీదు తీసుకోవాలని తెలిపారు. రోజువారీ రిపోర్టులను అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులకు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, వర్షాల వలన ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్‌లు, గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతుల వారీగా కొనుగోళ్ల, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతి రోజూ ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం కేంద్రాల వారీగా ఇప్పటివరకు కొనుగోళ్ల, ట్యాబ్‌లలో నమోదు ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో డిఆర్‌ఓ భుజంగ్‌రావు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీకళ, డిసిఓ నర్సయ్య, ఏడి మార్కెటింగ్ అశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 5లక్షలకుపైగా విత్తన సంచులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో వివిధ మండలాలలో డీలర్‌ల వద్ద 5,54,335 పాకెట్ల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల్లో విత్తన దుకాణాలను సంప్రదించి కొనుగోలు చేయవచ్చని, ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఏ విత్తన దుకాణాదారుడైన గరిష్ట అమ్మకపు ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే, పత్తి విత్తనాలు అందుబాటులో ఉండి ఇవ్వకుంటే మండల వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో విధిగా రశీదు పొందాలని పేర్కొన్నారు. పంటకాలం పూర్తి అయ్యేవరకు బిల్లు భద్ర పరుచుకోవాలని పేర్కొన్నారు.

వ్యవసాయ కార్యాలయంలో హెల్ప్ లైన్

జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో హెల్ప్ లైన్ నెంబర్‌ను ఏర్పాటు వేయడం జరిగిందని జిల్లా అధికారి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రైతులకు విత్తనాల కొనుగోలులో ఏదైనా సమస్యలు ఎదురైనా, విత్తనాల ఎంపికలో సలహాలు సూచనలకు 8074812429, 9392779149 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అలాగే తమ ప్రాంతంలో ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మినా, సమాచారం తెలిసినా ఈ నెంబర్లకు కాల్ చేసి తెలపాలని సూచించారు.

నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొబైల్ అప్లికేషన్ శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నుండి మొబైల్ అప్లికేషన్‌పై హైదారాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మొబైల్ అప్లికేషన్‌పై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఎంపిడిఓలు, ఏపిఓలు, ఏపిఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఏస్, సీసీఐకేపీలను సర్వే అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 847 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, జీపీలు 468, ఇళ్లు 1,47,894 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఎన్ని, నీరు వస్తుందా? లేదా అనే వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్లు చెక్ చేసి కుటుంబ సభ్యుల వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 35 వరకు అప్లికేషన్లు 10 రోజుల్లో పూర్తి చేయాలని, ఈ సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణలో డీపీఓ శ్రీలత, ఎస్‌ఈ ఎండి సురేష్, ఈఈ చంద్రమోహన్, డీఎల్పీఓ ఫణీంద్ర, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

10వనుండి యధావిధిగా ప్రజావాణి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10 నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని, ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఇక నుండి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని నేరడిగొండ(జి) గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న గోదుమల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామసమైక్య సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన ఏకరూప దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రావ్, సీసీ కౌసల్య, వీఓ నాయకురాలు వందన, అనసూయ, సీత, వీఓఏ రాంచందర్ పాల్గొన్నారు.



ఆర్మీ జవాన్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో హవల్దర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సూర్యవంశీ రాజేశ్వర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. దేశ సేవలో అమరుడైన జవాన్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళు లర్పించారు. ఆమె వెంట బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమామ్, నాయకులు లక్ష్మణ్, నవీన్, మల్లేష్, దత్తు పాల్గొన్నారు.



పల్లెల్లో గాడి తప్పిన పాలన

- ప్రత్యేకాధి పాలనలో ప్రజలకు అవస్థలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- వరుసగా ఎన్నికలు రావడమే ప్రధాన కారణం

నవతెలంగాణ-ఇచ్చోడ

గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగియడం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కావటంతో పల్లెలు అభివృద్ధిలో వెనుకబాటుకు గురికావొద్దనే ఉద్యేశంతో ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది ప్రభుత్వం. అందులో భాగంగా మండలంలోని 32 గ్రామపంచాయతీలకు గాను, 12 మందిని మండలస్థాయి (గెజిటెడ్)అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. వీరు ఆయా పంచాయతీల కార్యదర్శిలను సమన్వయం చేసుకుంటూ, నిరంతరం గ్రామాలను సందర్శించాలని ఆదేశించింది. ఇంత వరకు బాగానే ఉన్న, పల్లెలకు నియమించబడ్డ స్పెషల్ ఆఫీసర్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటం, పార్లమెంట్ ఎన్నికల రావడంతో, వారు పంచాయతీల్లో కానరాని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పనులు పడకేసిందని ప్రజల వాపోతున్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 46 ప్రకారం ప్రతి రెండు నెలలకోసారి పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలను నిర్వహించి, వాటిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, గ్రామంలో చేపట్టాల్సిన పనులపై నిర్ణయం తీసుకోవడం, ప్రజా సమస్యలపై గతంలో చేసిన పనులపై చర్చిస్తుంటారు. కానీ ప్రస్తుతం సాగుతున్న ప్రత్యేకాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల వాదన మాత్రం మరోలా వుంది. ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఎస్ఎఫ్‌సీ నిధులు రాకపోవడం పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ము అంతంత మాత్రంగానే ఉండటంతో తాగునీరు, పారిశుధ్యం వంటి కార్యక్రమాలకు తాము సొంతగా ఖర్చు చేసినట్లు వారు పేర్కొంటున్నారు. కేవలం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల నాలుగు నెలలకోసారి జనాభా దమాషా ప్రకారం విడుదలవుతున్నాయి. కానీ అవి ట్రాక్టరు కిస్తీలు, డిజీల్, కార్మికుల వేతనాలకే సరిపోవడం లేదని కొందరు కార్యదర్శులు వాపోతున్నారు. ఏది ఏమైనాప్పటికీ పంచాయతీల నిర్వహణ తమకు భారంగా మారిందని, వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక తాము ఖర్చు చేసిన డబ్బులు తిరిగి రాక, నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుపుతున్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో అవస్థలు..

పంచాయతీలకు నియమించబడ్డ ప్రత్యేకాధికారులు మండలస్థాయి అధికారులు కావడంతో వారు తమ సొంత కార్యాలయాల్లోని పనులు, నిన్న మొన్నటి వరకు పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటం ఇలా అనేక కారణాలతో పంచాయతీలకు హాజరు కాని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ప్రతి 500 మంది జనాభాకు ఒకరు చొప్పున నియమించిన మల్టీపర్పస్ వర్కర్‌కు కొన్ని గ్రామాల్లో రెండు మూడు నేల నుంచి వేతనాలు అందక పోవడంతో వారు పారిశుధ్య పనులు చేసేందుకు విముఖత చూస్తున్నట్టు తెలుస్తోంది. గత సర్పంచుల కాలంలో వారి వేతనాల విడుదల ఆలస్యమైనప్పుడు, కార్మికులకు సొంత నిధులు వేచ్చించి పనులు చేయించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ, మురుగు తొలగింపు, వీధిలైట్లు మరమ్మతు, నీటి సరఫరాలలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా గత ప్రభుత్వా హయంలో లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డ్‌ల, సెగ్రిగేషన్ షెడ్డుల నిర్వహణ లోపం మూలంగా ఆకతాయిలకు అడ్డగా, మందు బాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. గ్రామాల్లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన శ్మశాన వాటికలు, వసతులు లేని పంచాయతీల నిర్వహణ లేమీ కారణంగా పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి.



అపరిశుభ్ర వాతావరణంలో చేతిపంపు

బండి సంజయ్‌ని కలిసిన ఎంపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ జాతీయ కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని ఆదిలాబాద్ నూతన ఎంపీ గోడం నగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఢిల్లీలో ఎంపీ బండి సంజయ్‌ను నగేష్ కలిసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అటు బండి సంజయ్ సైతం ఎంపీ నగేష్‌ను శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, నాయకులు ముస్తపురే అశోక్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లో డిప్యూటేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ ఇంగ్లీష్ మీడియంలో డిప్యూటేషన్‌పై పనిచేయుటకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న అర్హత గల సర్‌ప్లస్‌లో ఉన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లో గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, బయాలజికల్ సైన్స్ 1, సోషల్ 1, ఇంగ్లీష్ 1, హిందీ 1, తెలుగు1 పోస్టులు ఉన్నాయి. ఎస్జీటీ 2 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డీఈఓ కార్యాలయంలో ఈనెల 11లోగా సమర్పించాలని పేర్కొన్నారు.

డీసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్‌కు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 30 వరకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీసీఎస్ఈ.డీసెట్.గావ్.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 10న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-జైనథ్

నవతెలంగాణ పత్రికలో ప్రచురితమైన పని చేయని చేతి పంపు అనే శీర్షికకు అధికారులు స్పందించి శుక్రవారం బాగు చేయించారు. దీంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వివిధ కాలనీల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సీసీఐ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కొరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సబ్ స్టేషన్ పరిధి లో జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బద్క మోహెళ్ల, బ్రహ్మణవాడ, పంజేశా ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

రిమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో...

పట్టణంలోని రిమ్స్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కొరకు శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. దీంతో టీచర్స్ కాలనీ సప్తగిరి కాలనీ, కలెక్టర్ చౌక్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, సంజయ్ నగర్ కాలనీల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

పట్టణంలో విద్యుత్ అంతరాయం..

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని విద్యానగర్, భూక్తపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మోచిగల్లీ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిదిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎర్రజి హరీష్, మడావి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పలు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, షు, యూనిఫాంలు అమ్ముతు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజుల పెంచారని వీటి నియంత్రణ కోసం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒకపక్క ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే ప్రచార క్యాంపెయిన్స్ చేస్తూ ముందస్తు అడ్మిషన్లు చేసుకున్నారని పేర్కొన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఏఈఓ దత్తా, చంద్రకాంత్ అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. రశీదు తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు.

మినీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని లోకారి(కె) గిరిజన బాలికల మినీ గురుకులం పాఠశాలలో 1వ, 4వ, 5వ తరగతిలో కలిపి మొత్తం 53 సీట్లకు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ కే.ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 30, నాలుగో తరగతిలో 01, ఐదో తరగతిలో 22, సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు మినీ గురుకులం పాఠశాలలో గిరిజన బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేయు బాలికలు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ ఫోటో సహా హాజరు కావాలని కోరారు. ఒకటో తరగతిలో ప్రవేశం గాదిగూడ మండల స్థానిక బాలికలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. లక్కీడ్రా ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

ముందే విత్తనాలు విత్తుకోవద్దు



నవతెలంగాణ-నార్నూర్

రైతులు ముందే విత్తనాలు విత్తుకుని నష్టపోద్దని మంచి వర్షం పడిన తరువాత విత్తనాలు విత్తుకోవాలని ఏఓ రమేష్, ఏఈఓ సాయికృష్ణ సూచించారు. శుక్రవారం బలాన్‌పూర్ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు కల్పించారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు, తీసుకునేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ నియోజకవర్గంలో ప్రమాదవశాత్తు జరిగే సంఘటనల పట్ల బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మోహన్‌రావు పటేల్ ప్రజాట్రస్ట్ చైర్మెన్ మోహన్‌రావు పటేల్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెత్రి నరేందర్ అనే యువకుడు ఇటీవల విద్యుద్ఘాతానికి గురై మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాట్రస్ట్ ఛైర్మెన్ మోహన్‌రావ్ పటేల్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన ట్రస్ట్ ద్వారా రూ.10వేల చెక్కును మృతుడి బార్యకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ముథోల్ నియోజక వర్గంలో ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలు ప్రమాదం, పాముకాటు, షార్ట్‌సర్క్యూట్, పిడుగు పాటు, వరద ప్రమాదం అనుకోని సంఘటనలు జరిగితే మోహన్ రావ్ పటేల్ ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించి, బాసటగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, మాజీ సర్పంచ్ నిమ్మ పోతన్న, నాయకులు ఉదయ్, భూమన్న, సాయినాథ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి నిరుపేద కుటుంబానికి చెందిన గుంటే అనురాధా వికలాంగురాలు కావడంతో గ్రామ సంత్ సేవాలాల్ మహారాజ్ ఎంప్లాయిస్ యూత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రూ.5వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. చాలా కాలం నుంచి కాళ్లతో బాధ పడుతున్న ఆమెకు మనోధైర్యం ఇచ్చారు. వికలాంగ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. గ్రామ ఎంప్లాయిస్ యూత్ సహాయ సహకారాలు ఎల్లపుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో ఏఓ గణేష్, ఉపాధ్యాయులు చౌహాన్ కిషోర్, జాదవ్ పరశురామ్, చౌహాన్ మునిరామ్, జాదవ్ ఆనంద్‌రావ్, జాదవ్ సంతోష్, చౌహాన్ రామారావ్, రాథోడ్ సంజీవ్, రాథోడ్ రవీందర్, రాథోడ్ దిలీప్, జాదవ్ సురేందర్, రాథోడ్ అశ్విన్, రాథోడ్ రామేశ్వర్, రాథోడ్ శ్రావణ్, జాదవ్ రోహిదాస్, తానాజి నాయక్, దినేష్ పటేల్, వినోద్, లింబారావ్, శుభం ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు

- జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 6,729 మంది అభ్యర్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 9వ తేదీన ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున అన్నిరకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లలో మొత్తం 6,729 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పట్టణ ప్రధాన రోడ్డులు, చౌరాస్తాలలో సూచిన బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు లాంటివి నిర్వహించకూడదని, అనవసరంగా గుంపులు గుంపులుగా ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాల్సిందిగా పేర్కొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులు సూచనలు..

పరీక్ష రోజున ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఇస్తారని, 10 గంటలకు పరీక్షా కేంద్రం గెట్ మూసివేయడం జరుగుతుందని, 10 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన ఎవ్వరిని లోపలికి అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ఎగ్జామ్‌కు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్‌లో నియమనిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డ్, ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్‌లో ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లైతే 3-కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్ పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూకున్నట్లైతే, పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎగ్జామ్ రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఎగ్జామ్స్ హాల్ లోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్స్, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్స్, టాబ్లెట్స్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన గాడ్జెట్స్ అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ఎగ్జామ్ పూర్తి అయిన తర్వాత ఒంటిగంట వరకు ఎవ్వరిని బయటకు పంపడం జరగదని, అభ్యర్థులు ఎగ్జామ్ రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతో పాటు తీసుకు వెళ్లడానికి వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపింగ్ చేసినట్లు తేలితే చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

రిజిస్టర్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయించిన వివరాలను సక్రమంగా బోర్డు మీద గాని, రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీలర్‌లకు డీఏఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం ఉమ్మడి మండలంలోని లోకారి(కె), నార్నూర్ మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ గ్రామ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న సీడ్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన రైతులు ఆశించిన అన్ని రకాల రాశి పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులను నకిలీ విత్తనాలు ఇచ్చి మోసగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఏఓలు గిత్తే రమేష్, జాడి దివ్య, ఏఈఓలు సాయికృష్ణ, కల్యాణి, కొండిబా ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-నార్నూర్



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోందని ఎంపీడీఓ జవహర్‌లాల్ ఏంఈఓ అశన్న అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాడిహత్నూర్ జెడ్పీఎస్ఎస్, లోకారి(కె) ఎంపీపీఎస్‌తో పాటు తదితర గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

చిన్నారి చైత్రకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-సారంగాపూర్

విద్యుత్ స్తంభం ఇరిగిపడి గాయపడ్డ చిన్నారి చైత్రకు(3) వైద్య చికిత్స కోసం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రూప్ సభ్యులు వరదెల్లి మహేష్, తోట నర్సయ్య, చవాన్ ప్రకాష్‌లు చిన్నారి స్వగ్రామమైన కొట్ల(బి)లోని చిన్నారి గృహనికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆరోగ్యపరిస్థితులు అడిగి తెలుసుకొని, రూ.20 వేల నగదును అందజేశారు. గ్రూపు సభ్యులు ఈ సందర్బంగా చిన్నారి తల్లిదండ్రులు గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని చెడ్వాయి, మొట్లగూడ గ్రామాలలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏఈఓ గౌసియా బేగం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని దుకాణ యజమానులకు సూచించారు. ఎరువుల దుకాణాలలో స్టాక్ రిజిస్టర్‌లో స్టాక్ నమోదు చేయాలన్నారు. స్టాక్ బోర్డులో రోజు వారీగా అందుబాటులో ఉన్న విత్తనాలు ధరలు రాయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకే అమ్మలని సూచించారు. రైతులకు రసీదులను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కటినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్న వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

పాఠశాల ప్రారంభానికి ముందే పుస్తకాల అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నట్లు జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఆసిఫాబాద్ మండల నోడల్ అధికారి ఉదయ బాబు అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు మంజూరైన పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ సంతోష్ కుమార్, సీసీఓ అనూప్ కుమార్, సీఆర్పీలు తిరుపతి, స్వప్న, ప్రవళిక, వెంకన్న పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వరరావు, కాశబోయిన సురేష్, జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీ నరసింహం, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో 6 కేంద్రాల్లో 1271 మంది అభ్యర్థులు, కాగజ్‌నగర్ పట్టణంలో 7 కేంద్రాల్లో 1512 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని అన్నారు. ఉదయం 9 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, చరవాణిలను ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. మహిళా అభ్యర్థులు ఎటువంటి ఆభరణాలు ధరించి రాకూడదని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు 3 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు, జిల్లా అధికారులు, ఐడెంటిఫికేషన్, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. పశువుల రవాణా నివారించడానికి ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా పశువులు రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. చెక్ పోస్టులను పశుసంవర్ధక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు దృష్టికి వస్తే సంబంధిత పోలీసులకు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, స్వయంగా వెళ్లి అక్రమంగా అడ్డుకోనీ గొడవలు సష్టించినట్లయితే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా పశువులను రవాణా చేసే అవకాశం ఉన్నందున ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పండగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన పశువుల సంతలో పశువుల రవాణాకు కావాల్సిన అనుమతి పత్రాలు తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని వాటిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వధశాలకు అనుమతి లేని పశువులను, దూడలు, గోవులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని పశువుల వ్యాపారులు ఈ సున్నితమైన అంశాన్ని గమనించాలన్నారు. పశువులను ఒకచోట నుండి మరొక చోటికి తరలించడానికి పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా వెంట ఉండాలన్నారు. పశువుల సంతలో కొనుగోలు చేసిన పశువులను తీసుకొని వస్తున్నట్లయితే వాటిని అమ్మినా వారి వివరాలు, సంబంధిత పశువైద్యాధికారి ధ్రువీకరించిన ఆరోగ్య, రవాణాకు అనుమతి పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రవాణా చేస్తున్న సమయంలో పశువులకు ఎలాంటి హాని తలపెట్టిన, హింసించిన చట్టప్రకారం తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు, పశుసంవర్ధక శాఖ అధికారులకు ఉంటుందని తెలిపారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- వ్యవసాయం అధికారిపై సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ-వాంకిడి



మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ముండే విమలాబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. మండలంలోని రైతులకు విత్తనాలు సక్రమంగా ఇవ్వడం లేదని సభ్యులు వ్యవసాయ మండల అధికారి మిలింద్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి విత్తనాలు ఇవ్వడంలేదని, ఎంఆర్‌పీ ధరలకు అమ్ముతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన రైతులకు ఇక్కడి నుండి విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని, మండలంలోని రైతులకు కావాల్సిన విత్తనాలు ఇవ్వడంలేదని, ఇచ్చినా ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధరకు దుకాణాల్లో అమ్ముతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడంతోనే స్థానిక వ్యవపారస్తులు ఇష్టంవచ్చిన ధరలకు అమ్ముతున్నారని అసహనం వ్యక్తం చేశారు. దుకాణాలను తనిఖీ చేసి ఎంఆర్‌పీ ధర కంటే అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రవీన్ అధికారి తాండవ కృష్ణను అడుగగా త్వరలోనే అన్ని దుకాణాల్లో తనిఖీ చేసి అధిక ధరలకు అమ్ముతున్న యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత నెల 24న కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామంలో భీమన్న ఆలయం వద్ద హిందూ దేవుళ్లను, బజరంగ్‌దళ్‌ను విమర్శిస్తూ మాట్లాడిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబుపై చర్యలు తీసుకోవాలని బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ బజరంగ్‌దళ్‌తో పాటు విశ్వహిందూపరిషత్ కార్యకర్తలను సీఐ దూషించగా, అదే రోజు తాము డీఎస్పీ కార్యాలయం ముందు శాంతియుత ధర్నా చేపట్టినట్లు తెలిపారు. అక్కడికి వచ్చిన అదనపు ఎస్పీ, డీఎస్పీలు రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు సీఐపై చర్యలు తీసుకోలేదని అన్నారు. చర్యలు తీసుకోని ఎడల రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, అడ్వకేట్ విజయ్, సాయి, వినోద్, ప్రదీప్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



దేశానికి సేవ చేయడం మన బాధ్యతగా గుర్తించి ఆర్మీ ఉద్యోగం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో ఆర్మీలో ఉన్నత పదవులు సాధించాలని రమేష్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో అగ్ని వీర్‌లో ఉద్యోగం పొందిన ఇటిక్యల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఎల్ ధర్మ, ఎల్ దశరథ్, సెండే పాలకరావ్‌లను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి చదువుకొని దేశ సేవ చేయాలనే దృక్పథం ఆసక్తిని కలిగి ఉండడం అభినందనీయమని ఇలాగే భవిష్యత్తులో క్రమశిక్షణతో విధులు నిర్వహించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేస్ ధోత్రే



నవతెలంగాణ-రెబ్బెన

బడీడు పిల్లలని తప్పక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వివిధ ప్రయివేటు పాఠశాల్లో చదువుతున్న 50 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేదుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలయ్యకు అభినందనలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం నుండి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించిన నందమూరి బాలకృష్ణను శుక్రవారం టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు జి ఆనంద్ కలిసి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ విజయం స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా విజయం సాధిస్తామని ఈ సందర్భంగా ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు.

కోసు పటేల్ గూడలో బడిబాట కార్యక్రమం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కోసు పటేల్ గూడ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలు బడిలో చేరాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, ప్రకాష్, విద్య, సాయి, బోజరెడ్డి, కొండిబా, గ్రామస్తులు యాదవ్‌రావ్, రావూజి పాల్గొన్నారు.

10న ప్రజావాణి కార్యక్రమం

నవతెలంగాణ-పెద్దపల్లి

లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉండడం వలన ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిర్వహించబడలేదని, ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున తిరిగి ఈ నెల 10నసోమవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి ప్రజావాణిలో తమ అర్జీలను అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

బహిరంగ వేలం

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలంలో అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుకను స్వాధీన పరుచుకొని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని తాడిచెర్లకు వెళ్లే బ్రిడ్జీ వద్ద నిల్వ ఉంచడం జరిగిందని, స్వాధీన పరుచుకున్న ఈ ఇసుకకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని వేలం అధికారి, ముత్తారం మండల గిర్దవార్-2 ఒక ప్రకటన తెలిపారు. 60 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక ఉందని, దీని విలువ 1,13,400 రూపాయలుంటుందని తెలిపారు. నిర్ణయించిన ప్రకారం 5వేల దరావత్ కట్టి వేలంలో పాల్గొనాలని, వేలంలో పాల్గొనే వారు ఆదాయ పన్ను రిటర్స్ కాపీ సమర్పించాలని, వేలం దక్కని వారికి వేలం ముగిసిన అనంతరం చెల్లించిన పైకంకు సంబంధించిన రశీదు తీసుకొని సొమ్ము ఇవ్వబడునని, బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారికి సరుకు స్వాధీనం చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులకు లోబడి ఉంటుందని తెలిపారు. ఈ నెల 11న ఉదయం 11.30గంలకు ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి, అర్హత గలిగిన వారు పాల్గొనాలని ఆయన సూచించారు.

ఎద్దాపూర్‌లో తుమ్మపొదల తొలగింపు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల హనుమాన్ గుడి సమీపం నుండి మల్లన్న గుడి వరకు రోడ్డుకు ఇరువైపులా తుమ్మ పొదలు, చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించారు. వలన వాహన దారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రత్యేక అధికారికి, పంచాయతీ కార్యదర్శికి ప్రజలు సమస్యను తెలిపారు. స్పందించిన అధికారులు జేసీబీ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించారు.

బాధ్యతలు స్వీకరించిన డోంగ్రే రేవయ్య



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన దళిత యువకుడు డోంగ్రే రేవయ్య 2022-23 సివిల్ సర్వీస్ బ్యాచులో దేశ వ్యాప్తంగా 410వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మహారాష్ట్రలోని వార్ధా తాలూకాలో అదనపు పాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో తన కుటుంబ సభ్యులు, బంధువులు ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ లైన్ మరమత్తులు ఉన్నందున లక్ష్మీపూర్ నుంచి లోనవెల్లి సబ్ స్టేషన్ వరకు మరమ్మత్తులు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9.00 గంటల నుండి ఉదయం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది, సిర్పూర్, లోనవెల్లి, కౌటాల, చింతలమానపల్లి, బెజ్జూరు మండలాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్, డీడీయు-జీకెవై ఆధ్వర్యంలో ప్లంబింగ్(ఫిట్టర్)లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఎసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం నాగేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పించబడునని, శిక్షణ అనంతరం ప్రయివేట్ రంగంలో ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. నెల వారీ జీతం రూ.18,000 నుంచి రూ. 20,000 వరకు ఉంటుందని, దరఖాస్తు చేసుకునే వారు వివరాలకు బెల్లంపల్లిలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 8328507232లో సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలి

నవతెలంగాణ-నిర్మల్



ఈ నెల 9న జరగనున్న గ్రూప్-1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-1 పరీక్ష నిబంధనలపై విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవగహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. విధులు నిర్వహించే అధికారులు సమన్వయతో పని చేయాలని సూచించారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఉదయం 7గంటలకు అధికారులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9 గంటల నుంచి 10 గంటలవరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రల్లోకి అనుమతించాలని అన్నారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులతో సహా సిబ్బందికి కూడా మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు తెచ్చుకునే హాల్ టికెట్, ఫొటో, ఇతర గుర్తింపు కార్డులతో సరిపోల్చుకోవాలని, బూట్లు, బెల్ట్‌లకు అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. అంతక ముందు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా గ్రూప్-1 పరీక్ష నోడల్ అధికారి ఫైజాన్ అహ్మద్ పరీక్ష నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లు, అధికారుల విధులు, తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో గ్రూప్-1 పరీక్ష ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీ వైద్యశాలకు దంపతుల శరీర దాన అంగీకారం

నవతెలంగాణ-గోదావరిఖని

గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డు సీనియర్ మైనింగ్ సూపర్వైజర్ బత్తుల చక్రపాణి, వారి సతీమణి మంగమ్మ సమాజ హితం కోరి, గొప్ప సంకల్పంతో తమ మరణానంతరం తమ పార్థీవదేహాలను మెడికల్ విద్యార్థుల వైద్య విద్య నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కి అందిస్తామని ముందుకు రాగా, తెలంగాణ నేత్ర, అవయవ శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులకు సమాచారమే ఇవ్వగా, వారు ఈ ఆదర్శ దంపతుల నుండి అంగీకార పత్రాలు సేకరించారు. ఈ శరీర దాన అంగీకార పత్రాలను వైద్య కళాశాలకు అందించి, తగిన ప్రశంసా పత్రాలను వారికి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆదర్శ దంపతులను స్ఫూర్తిగా తీసుకొని పౌర సమాజం, సామాజిక బాధ్యతగా భావించి, నేత్ర శరీర దానాలు చేయడానికి ముందుకు రావలసిందిగా అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరేటి శంకర్‌రావు, భూపాల్ జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి, సభ్యులు బామాండ్ల పెళ్ళి మల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలంలోని జీలకుంట గ్రామా నికి చెందిన నల్ల శ్రీనివాస్ రెడ్డి వయస్సు (40) గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం కురిసిన వర్షానికి ఇంట్లో కరెంటు పోయింది. ఇంట్లో కరెంటు లేకపోవడంతో చుట్టుప క్కల వారి ఇండ్లల్లో కరెంటు ఉండడంతో విద్యుత్ పోల్‌పై ఉన్న విద్యుత్తు తీగ సరిగా ఉందా లేదా చూద్దామని వెళ్లి కరెంటు తీగను కర్రతో కదిలించడంతో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. గమనిం చిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

సీఎంతో ముఖాముఖి కార్యక్రమానికి కిష్టాపూర్ విద్యార్థి

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ నిర్వహించే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ముఖాముఖి కార్యక్రమానికి మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2023-24 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన రాథోడ్ ఈశ్వర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. అలాగే పదవ తేదీన హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర రాష్ట్ర శాఖ అధికారులు 10 జీపీఏ సాధించిన విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి వందేమాతరం విద్యాదాత పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ముఖ్య మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి ఎంపికైన రాథోడ్ ఈశ్వర్‌ను మండల విద్యాధికారి విజయ్ కుమార్ ప్రధానోపాధ్యాయుడు గుండా రాజన్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగ, ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్ అభినందించారు.

అభివృద్ధి పనుల వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలి



తాండూర్ : గ్రామపంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పథకాల వివరాలను 7 రిజిస్టర్లలో నమోదు చేయాలని జిల్లా డీఆర్డీఏ అంబుడ్స్ మాన్ శివరాం తెలిపారు. శుక్రవారం తాండూరు గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. తాండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని పరిశీలించి, మొక్కల పెరుగుదలను పరిశీలించారు. ఈజీఎస్‌కు సంబంధించిన పని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ రాజ్ కుమార్, టీఏలు రాజేంద్ర ప్రసాద్, భార్గవ్, పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్ ఉన్నారు.

గుడుంబా తయారీకి సహకరిస్తే చర్యలు

● ఎక్సైజ్ సీఐ నర్సిములు



నవతెలంగాణ-జన్నారం

గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి సరుకులు(బెల్లం,పటిక) అమ్మితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని వర్తక సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత వస్తువైన బెల్లం అమ్మకంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిషేధిత వస్తువైన బెల్లం ఎట్టి పరిస్థితుల్లో అమ్మ రాదని, చుట్టుపక్కల గ్రామాల వారు గుడుంబా తయారీకి భారీగా బెల్లం ఉపయోగిస్తున్నారని, అందువలన బెల్లం అమ్మినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని బైండోవర్ చేస్తామని తెలిపారు. దుకాణంలో 20 కిలోలకు మించి బెల్లం ఉంచరాదని, అందులోంచి కూడ కిలో బెల్లం కావలసినవారు కూడా ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్‌తో కూడిన వివరాలను ఇచ్చి తీసుకొని అమ్మకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు ఓజ్జల వామన్, కార్యదర్శి జక్కు రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సీఎంపీఎఫ్ సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సీఎంపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అన్నారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ చేస్తున్నామని సాకుతో సీఎంపీఫ్ చిట్టీలు ఇవ్వక పోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. యాజమాన్యం గత రెండు సంవత్సరాల తాలూకు సీఎంపీఎఫ్ చిట్టిలు ఇవ్వాలని, ఆన్‌లైన్‌పై కార్మికులకు అవగాహన కల్పించాలని అన్నారు. 2020-21లో ఇచ్చిన సీఎంపీఎఫ్ వడ్డీ రేట్లు సరిచేయాలని, రిటైర్డ్ కార్మికులకు ఇప్పటివరకు 11వ వేజ్ బోర్డు రివైజ్డ్ పెన్షన్ కొరకు అప్లికేషన్లు తీసుకొని మూడు నెలలుగా కొత్త పెన్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. రిటైర్డ్ కార్మికుల రివైజ్డ్ పెన్షన్ ఇవ్వాలని,11వ వేజ్‌బోర్డు ప్రకారం గ్రాట్యూటీ తేడాలను లెక్కించి సరిచేసి ఇవ్వాలన్నారు. అలాగే సేఫ్టీ కమిటీలు సక్రమంగా నడవకపోవడం వల్ల కార్మిక సమస్యలు పేరుకుపోతున్నాయని, గతంలో ఇచ్చే నాణ్యమైన డ్రిల్ రాడ్లు చెమ్మసులు వంటివి నాసిరకంగా వస్తున్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గెలిచామని చెప్పుకుంటున్న నాయకులు ఇలాంటి విషయాలపై యాజమాన్యాన్ని ప్రశ్నించకుండా అధికారిక కార్యక్రమాలకు హాజరవుతూ గుర్తింపు పత్రం రాలేదనే సాకుతో కార్మిక సమస్యలను పెండింగ్ పెట్టడం సరికాదని త్వరలో కార్మికుల పెండింగ్ సమస్యలపై అన్ని గనులపై ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్, సుధాకర్, సాయిల శ్రీనివాస్, శ్రీధర్, మెడివేల్లి శ్రీనివాస్, పెరుక సదానందం, సిరికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనుల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ క్యాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ పరిశీలించారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ బస్తీ, మహేంద్ర బస్తీ దేవాపూర్ పాఠశాలలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ పనులు, మైనర్ రిపేర్లు, టైల్స్, వాటర్ పనులను పర్యవేక్షించారు. అన్ని పనులు పాఠశాలలు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, కాంట్రాక్టర్లకు నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ సూచించారు.

ఇంటర్మీడియట్ ఎంపిక జాబితా విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందే విద్యార్థుల ఎంపిక జాబితాను ప్రకటించడం జరిగిందని మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య పేర్కొన్నారు. ఈ ప్రకటించిన ఎంపిక జాబితాను కళాశాల నోటీస్ బోర్డ్ పైన ఉంచడం జరిగిందని, వ్యక్తిగతంగా విద్యార్థులకు మెసేజ్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుందన్నారు. మెరిట్ జాబితాలో సీటు సాధించిన విద్యార్థులు టీసీ, బోనోఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలతో 11వ తేదిలోపు అడ్మిషన్ పొందగలరన్నారు.

జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో జన్మించి మంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి అని, నాటి స్వాతంత్ర ఉద్యమం నుండి తెలంగాణ రాష్ట్ర సాధన తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో పాల్గొని రాష్ట్ర ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వానికి చాటిచెప్పిన ఉద్యమ కారుడని అన్నారు. అలాంటి ఉద్యమ కరుడికి బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వకపోవడం అనేది పూర్తిగా బీసీల పట్ల వివక్ష చూపడమే అవుతుందన్నారు. తన సొంత ఇంటిని అప్పటి టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి ఇచ్చిన వ్యక్తి రాష్ట్రాన్ని సాధించేంతవరకు ఏ పదవి చేపట్టనని తన మంత్రి పదవికి రాజీనామా చేసిన ఉద్యమ నాయకుడన్నారు. అలాగే రాష్ట్రంలో మొట్టమొదటగా బీసీ సంఘం స్థాపించి బీసీ రాజ్యాధికారం ఉద్యమాన్ని నడిపిన కొండ లక్ష్మణ్ బాపూజీకి సరైన గుర్తింపు దక్కాలంటే మంచిర్యాల జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని డిమార్ చేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో అన్ని బీసీ కులాలను కలుపుకొని రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, తులా మధుసూదన్, గజ్జెల్లి వెంకన్న, అక్కల రమేష్ వర్మ, నల్ల నాగేంద్రప్రసాద్, శ్రీపతి రాములు, శాఖపురం భీమ్సేన్, కీర్తిభక్షపతి, బోర శేఖర్, కొంతం రాజు, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్, ఆరెందుల రాజేశం, బండ సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని కాసిపేట విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణ లత తెలిపారు. కాసిపేట మండలంలోని కొండాపూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర ర్యాంకర్‌కు కలెక్టర్ సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లాకు చెందిన విద్యార్థిని దుర్గం మమత రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, కళాశాల ప్రత్యేక అధికారి సుమనచైతన్య, సుధారాణితో కలిసి విద్యార్థిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని దుర్గం మమత ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో మరింత విద్యార్థినీ, విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణిస్తూ జిల్లాకు, విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత చదువులు అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు ఇరు గ్రూపుల తగాదా



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచ్చులాపూర్ తాండూర్ గ్రామాల మత్స్యకార సొసైటీ సభ్యుల మధ్య నల్లవాగు ప్రాజెక్టు చేపల వేట విషయంలో శుక్రవారం వివాదం చోటుచేసుకుంది. వివారాల్లోకెళితే అచలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 380 ఎకరాల నల్లవాగు ప్రాజెక్టు ఉంది. నల్లవాగు ప్రాజెక్టులోని చేపలు పట్టుకునే హక్కు తమకే ఉందని అచలాపూర్ గంగపుత్రులు వాదిస్తుండగా నల్లవాగు ప్రాజెక్టులోని చేపలు పట్టే హక్కు తాండూరు మండల పరిధిలోని 412 మంది సొసైటీ సభ్యులకు భాగస్వామ్య హక్కు ఉంటుందని తాండూరు మత్స్యకార సొసైటీ సభ్యులు వాదిస్తున్నారు. శుక్రవారం చేపలు పట్టడానికి వెళ్లిన ఇరు గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకొని పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. తాండూర్ సీఐ కుమారస్వామి ఫిషరీస్ ఏడీఏ సత్యనారాయణ, ఆర్ఐ మురళీధర్ రావు, ఎంపీడీఓ శ్రీనివాస్ సొసైటీ సభ్యుల మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నం చేశారు. సహకార సంఘం పరిధిలో వివాదం సద్దుమణిగేలా రాజీ కుదుర్చుకోవాలని అధికారులు సొసైటీ సభ్యులకు సూచించారు.

గ్రూప్-1 అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జూన్ 9న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్ టిక్కెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగా నిర్ధారించుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు అందించే వ్యక్తిగత ఓఎంఆర్ షీట్లపై సంబంధిత అభ్యర్థుల వివరాలు ముద్రించి వస్తాయని, అట్టి వివరాలతో పాటు, పరీక్ష నియమ, నిబంధనలను సరి చూసుకోవాలని తెలిపారు. పరీక్షలో అభ్యర్థులకు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా నమూనా ఓఎంఆర్ షీట్ను వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు పాటించవలసిన నియమాలను హాల్ టిక్కెట్లపై కూడా ముద్రించడం జరిగిందని, అభ్యర్థులు ఈ నియమాలను తెలుసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభించడం జరుగుతుందని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుండి బయటకు వెళ్ళరాదని, ఒకవేళ వెళ్ళినట్లయితే అట్టి అభ్యర్థి ఓఎంఆర్ షీట్ పరిగణలోకి తీసుకోబడదని, బయోమెట్రిక్ తీసుకునేందుకు అభ్యర్థుల చేతివేళ్ళపై ఎలాంటి మెహందీ, తాత్కాలిక టాటూస్ ఉండరాదని తెలిపారు. బూట్లు, మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు (కాలిక్యులేటర్, పేజర్, ట్యాబ్ లెట్లు, పెన్ డ్రైవ్, బ్లూటూత్ డివైజెస్, వాచ్, మ్యాథమెటికల్ టేబుల్స్, లాగ్బుక్స్, లాగ్ టేబుళ్ళు, వ్యాలెట్, హ్యాండ్బ్యాగ్, జోలాస్, పౌచెస్, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, చాట్స్, లూసీట్స్, జువెల్లరీ, ఇతర ఉపకరణాలు, రికార్డింగ్ పరికరాలు మొదలగు)ను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగదని, అభ్యర్థికి సంబంధించిన వస్తువులను భద్రపరచేందుకు ఎలాంటి సౌకర్యం కల్పించడం జరుగదని తెలిపారు. ప్రతి అరగంటకు ఒకసారి సమయాన్ని తెలియజేసేలా గంట మోగించడం జరుగుతుందని, అభ్యర్థులు ఇన్విజిలేటర్ల ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే ముందుగానే పరీక్ష సంబంధించిన ప్రతి నియమ, నిబంధనలను చదువుకొని పూర్తిగా తెలుసుకొని ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ బాల్‌పెయింట్ పెన్నుతో పాటు ప్రభుత్వంచే జారీ చేయబడిన ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు (పాస్‌పోర్ట్, పాన్కార్డు, ఓటరు కార్డు, ఆధార్కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతరత్రా) తీసుకురావాలని, కొత్తగా దిగిన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో హాల్ టికెట్‌పై అతికించాలని తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సహాయం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ 08736-250500 నెంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పైడిపల్లి బీట్‌లో అక్రమంగా చెట్లు నరికిన వెడ్మ లక్ష్మణ్‌కు లక్షెట్టిపేట జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్ల పేట ఎస్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. వెడ్మ లక్ష్మణ్ పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని పైడిపల్లి బీట్లో ఎన్నోసార్లు విలువైన టేకు చెట్లను నరికి వేసి అక్రమంగా సొమ్ము చేసుకున్నారని, ఎన్నిసార్లు బైండోవర్ చేసిన తన ప్రవర్తన మార్చుకోలేదని సుష్మారావు తెలిపారు.

భారీ యంత్రాలు వినియోగించి ఉత్పత్తి సాధించాలి



నవతెలంగాణ-నస్పూర్

భారీ యంత్రాల వినియోగాన్ని పెంచాలని, వాటి ద్వారా వీలైనంత ఎక్కువ ఉత్పత్తిని సాధించాలని డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీఎం బి సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా బేస్ వర్క్ షాప్‌ను, స్టోర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్టోర్స్‌లో విడిభాగాలను అందుబాటులో ఉంచుకోవాలని రాబోవు వర్ష కాలలో బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఓబి కాంట్రాక్టు కంపెనీ వారితో మాట్లాడి రోజువారీ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని ఓబి ఎంత ఎక్కువ తీస్తే అంత బొగ్గు తీయడానికి అవకాశం ఉంటుందని ఉత్పత్తి చేసిన బొగ్గును సరైన సమయంలో వినియోగదారులకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉత్పత్తి చేసిన బొగ్గు నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నవతెలంగాణ-జన్నారం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ బంకెట్ హాల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు నరసయ్య ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యమత్యంగా ఉండాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అవి నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర నాయకులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టించేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. జిల్లా కార్యవర్గంలో నూతనంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన దండేపల్లికి చెందిన సత్యం, కార్యవర్గ సభ్యుడు ఎన్నికైన గాజుల లింగన్నలను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర నాయకుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కేశెట్టి వంశీ కష్ణ, స్టాఫ్ రిపోర్టర్ వెంకటరెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ సురేష్, మండల ప్రెస్ క్లబ్ కోశాధికారి శీల చంద్ర శేఖర్, పూదరి సత్యనారాయణ, ఎంబడి మల్లేశం, అమరగొండ సతీష్ గౌడ్, భాను కిరణ్, గుండ పవన్, రాజు వెంకటపతి రాజు, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ మేల్ నూతన కమిటీని శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రాథోడ్ తులసీదాస్ అన్నారు. కమిటీ ప్రెసిడెంట్‌గా రాథోడ్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ సుభాష్, సెక్రటరీ రాథోడ్ భగవాన్‌దాస్, జనరల్ సెక్రటరీ రాథోడ్ కైలాస్, కోశాధికారిగా జాధవ్ వసంతరావు, వైస్ ట్రెజరర్‌గా రాథోడ్ జవహర్‌లాల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. మాపై నమ్మకం ఉంచి మాకు జిల్లా కమిటీలో ఎన్నుకున్న సందర్భంగా రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులకు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపారు.

దేవాపూర్‌లో బడిబాట



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడీడు పిల్లలను గుర్తించి అడ్మిషన్స్ చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల స్కాలర్షిప్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ హెచ్‌ఎం, మండల నోడల్ ఆఫీసర్ రమేష్ రాథోడ్, ఏఏపీసీ చైర్‌పర్సన్ ప్రియాంక, ఉపాధ్యాయులు సురేష్ బాబు, అంజాద్ పాషా, లచ్చన్న, రాజేష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

నోట్ బుక్స్, పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం పుస్తకాల పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆరు నుంచి పదో తరగతి వరకు నోట్ బుక్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా ఒకటవ తరగతి నుంచి రెండో తరగతి వరకు పుస్తకాల పంపిణీ చేశామని, ఇంకొన్న పాఠశాలలకు పంపిణీ చేయాల్సి ఉందని ఎంఈఓ భూమారెడ్డి తెలిపారు.

వార్షిక పరీక్షల పారితోషికం వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే పారితోషికం ఎప్పటికప్పుడు చెల్లించాలని జీజేఎల్‌ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాలలో నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఆసిఫాబాద్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో డిఐఈఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరీక్ష విధులకు సంబంధించిన మొత్తంతో పాటు ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ మొత్తాన్ని కూడా గతంలో మాదిరిగా చెల్లించాలన్నారు. పారితోషికం మొత్తం పది శాతం తగ్గించి ఇవ్వడం సరికాదన్నారు. గతంలో చాలా సార్లు వినతి పత్రాలు అందజేశామని, వెంటనే దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. డిఐఈఓ స్పందిస్తూ ప్రస్తుత సంవత్సరం నేరుగా చెల్లించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అమరేందర్, చంద్రయ్య, రాజమౌళి, ప్రభాకర్, తిరుపతి, కిషోర్ పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్ఓ ఆడే ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుర్దాపూర్, చౌపన్‌గూడ, నెహ్రూనగర్, సుల్తాన్‌గూడలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులసి దాస్, వనిత, హనుమంతరావు, రెహానా బేగం, గోయగాం కాంప్లెక్స్ సిఆర్పి ఆనంద్, వివో కమలా బాయి, మాజీ సర్పంచ్ సోము పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే పొలంలో బస చేయడానికైనా సిద్ధమే

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-ఇచ్చోడ

పేద రైతులకు అన్యాయం జరిగితే పొలంలో బస చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం శివారులో అటవీశాఖ అధికారులు రైతులపై చెలాయిస్తున్న పెత్తనాన్ని అడ్డుకునేందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బైకుపై వెళ్లారు. రైతులకు అన్యాయం జరిగితే తాను ఎంతకైనా తెగిస్తానని అన్నారు. గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి వారికి అండగా నిలిచింది, ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. కొన్ని కారణాల వల్ల కొందరికి పట్టాలు అందలేని, విషయాన్ని పసిగట్టిన కాంగ్రెస్, అమాయకమైన పేద వారిపై పెత్తనం చేయడం సరి కాదని హెచ్చరించారు. కేశవపట్నం శివారులోని పేదవారు బ్రతకడానికి ఏకైక మార్గం పొలం చేయడమని, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకొని వారి పొట్టని కొడుతుందని అన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్, స్లాబ్ వంటి పనులు, కొనసాగుతున్న పనులకు సంబంధించిన వివరాలను పాఠశాలల వారీగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులు పూర్తయిన తర్వాత పాఠశాల భవనాలకు పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ పనులు పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే ఉచిత ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బడులు ప్రారంభమయ్యే రోజు ప్రతి విద్యార్థికి దుస్తులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు పట్టణ, గ్రామీణ పాఠశాలలకు పూర్తయిన దుస్తువులు, ఇతర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి జెడ్పీ సీఈవో గోవింద్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్స్, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్లు లేక చీకట్లో ప్రజలు

- సంబంధితశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు

అది పేరుకే మండల కేంద్రం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం.. వారం రోజులుగా వీదిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీధిలైట్లు అమర్చడంలో విఫలమయ్యారు. వారం రోజులు గడుస్తున్న బల్బులు వెలుగడం లేదని ప్రజలు చీకట్లోనే తిరుగుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలు తెలుసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్ వెళ్లే రోడ్డులో, గ్రామంలోని పలు వార్డుల్లో వీధిలైట్లు వెలుగక ప్రజలు తమ వివిధ పనుల నిమిత్తం చీకట్లోనే నడుస్తూ, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో చీకటి పడగానే అసలు ఇది మండల కేంద్రమా మారుమూల ప్రాంతమా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వరకు ముఖ్యమైన కూడలిలో వీధిలైట్లు లేక పోవడంతో రాత్రులలో కోతులు దాడి చేసే ప్రమాదం ఉందని మండల ప్రజలు వాపోతున్నారు. రాత్రి 9 గంటలకు ఆదిలాబాద్ నుంచి తలమడుగు హాల్టింగ్ బస్సు వస్తుంది. ప్రయాణికులు బస్సు దిగగానే గందరగోళానికి గురవుతున్నారు. బస్టాండ్ ప్రాంతమంతా చీకట్లో ఉంటుంది. దీంతో ప్రయాణికులు తాము ఎటువైపు వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొంటుదని పేర్కొంటున్నారు. నిత్యం వివిధ గ్రామాల నుంచి వచ్చిన బంధువులు మండల కేంద్ర వాసులు ఇంత అన్యాయమా అంటు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ఈ పరిస్థితి ఉంటే మిగతా మారుమూల గిరిజన గ్రామాలలో ఏ విధంగా చీకటి ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేందుకు పర్యవేక్షించాల్సిన ప్రత్యేకాధికారులు అటువైపుగా చూడకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సర్పంచుల పదవీ కాలంలో వీధి లైట్లు సక్రమంగా ఉండేవని వాళ్ల పదవీ కాలం పూర్తయిన తర్వాత తాగునీరు, వీధిలైట్ల గురించి, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పేర్కొంటున్నారు. సమస్యలపై అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమస్యలు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొద్ది రోజుల కింద కురిసిన వర్షాలకు మండలంలో రోడ్లపై పాములు, తేళ్లు రోడ్లపై తిరుగుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. కొన్ని గ్రామాలలో సర్పంచ్ పదవీ ముగిసి నెలలు గడుస్తున్న మురుగు కాలువలు శుభ్రపర్చడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సర్పంచ్‌లు ఉన్నప్పుడు నేరుగా సర్పంచుకు సమస్యలు విన్నవించే వారిమని, ఇప్పుడు ఎవరికి చెప్పాలోనని అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

స్పందించని పంచాయతీ కార్యదర్శి

తలమడుగు మండల కేంద్ర పంచాయతీ కార్యదర్శి అశోక్ వీధిలైట్లు మురుగు కాలువల పరిశుభ్రతపై సమాచారం కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

చీకటి పడగానే అంత అంధకారం

పడిగెల నారాయణరెడ్డి, తలమడుగు గ్రామస్తుడు



మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వరకు వీధిలైట్లు లేకపోవడంతో పిల్లలు మహిళలు ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. అదేవిధంగా కోతుల బెడద కూడా ఎక్కువగా ఉండటంతో చీకటిలో దాడి చేస్తాయేమోనని భయాందోళనలో ప్రజలు ఉంటున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

లింగాల చిన్నన్న, తలమడుగు



తలమడుగు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గత 15 రోజుల నుంచి వీధిలైట్లు లేకపోవడంతో చీకటిగా మారింది. అసలు ఇది మండల కేంద్రమా అని అనిపిస్తుంది. ఇతర గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఇదేం మండలం అంటూ తిట్టితున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు, బల్బులు అమర్చి, చీకటి లేకుండా చూడాలని కోరుతున్నా.

ముచ్చటగా మూడోసారి గ్రూప్-1 పరీక్ష

- జిల్లాలో పరీక్ష రాయనున్న 2783 మంది అభ్యర్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగానికి డిమాండ్ ఎంతుందో ప్రతి ఒక్కరికి తెలిసిందే. అది గెజిటెడ్ అధికారి ఉద్యోగానికైతే వేరే చెప్పనక్కర్లేదు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గ్రూప్-1 పరీక్ష అభ్యర్థులకు పరీక్ష గానే మిగులుతోంది. 2015లో పరీక్ష నిర్వహించి ప్రక్రియ పూర్తిచేసే సందర్భంలో రద్దు చేయాల్సి వచ్చింది. అలాగే రేపు నిర్వహిస్తున్న పరీక్షను ఇప్పటికే అభ్యర్థులు రెండుసార్లు రాసి మూడోసారైనా తమ అదృష్టం కలిసి వస్తుందో లేదో అని చర్చించుకుంటున్నారు.

ముచ్చటగా మూడోసారి ప్రిలిమ్స్ పరీక్ష

గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి గ్రూప్-1కు ముందుకొచ్చి 2022లో నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అదే సంవత్సరం అక్టోబర్ 16న పరీక్ష నిర్వహించినప్పటికీ పేపర్ లీక్ అయిందని రద్దు చేశారు. అనంతరం మళ్లీ పరీక్ష నిర్వహించడానికి నిర్ణయించి 2023 జూన్ 11న పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో టిఎస్పిఎస్సి విధివిధానాలు పాటించలేదని పరీక్ష రద్దుచేసి తిరిగి నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. తర్వాత ఎన్నికలు రావడంతో ఆలస్యం జరిగి రేపు పరీక్ష జరగనుంది.



పరీక్షకు సిద్ధమైన అభ్యర్థులు

రాష్ట్ర వ్యాప్తంగా రేపు నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అభ్యర్థులు సిద్ధమయ్యారు.



జిల్లాలో పరీక్ష రాయనున్న అభ్యర్థులు ఇప్పటికే తీవ్రంగా శ్రమిస్తున్నారు. నూతన ప్రభుత్వంలోనైనా పరీక్ష నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేసి ఫలితాలు ఇచ్చేలా చూడాలని అభ్యర్థులు కోరుతున్నారు. జిల్లాలో 2783 మంది పరీక్ష రాయనున్నారు. దీనికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే నేతృత్వంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లో 1271, కాగజ్‌నగర్‌లో 1512 అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

మూడోసారి పరీక్ష రాస్తున్నా

తిరుపతి, రాంనగర్.

గ్రూప్-1 పరీక్ష కోసం 2021 నుండి సిద్ధమవుతున్నాను. రెండుసార్లు పరీక్ష రాసినప్పటికీ రద్దు కావడం తీవ్ర నిరాశ కలిగించింది. నూతన ప్రభుత్వమైనా పరీక్ష పటిష్ఠంగా నిర్వహించి ఫలితాలు సక్రమంగా ఇవ్వాలని కోరుతున్నాం.

పరీక్ష నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ రాజర్షిషా
- 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- 6,729 మంది అభ్యర్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 పరీక్ష నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెండిఫికేషన్ ఆఫీసర్స్, బయోమెట్రిక్ ఆఫీసర్స్ గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 9 వ తేదీన నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు ఉండాలని ఆదేశించారు. ఛీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష నిర్వహణను చేపట్టాలని, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కేంద్రాలలో సీటింగ్ అరెంజ్‌మెంట్, వసతులు పరిశీలించాలని, పురుష, మహిళ అభ్యర్థులకు విడివిడిగా తనిఖీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇతరులను అనుమతించవద్దని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణతో పరీక్షాల కేంద్రాలను పరిశీలించాలని, పరీక్ష రోజున ప్రతి సెంటర్ మూడు సార్లు పరిశీలించాలని, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు అభ్యర్థుల ఐడి కార్డులతో హాల్ టిక్కెట్లను పరిశీలించాలని, పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు ఎవరికీ అనుమతి లేదని, ఒక చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఎమర్జెన్సీ పర్పస్ అనుమతి ఉందని తెలిపారు.



అభ్యర్థులు సూచనలు జాగ్రత్తలు పాటించాలి

పరీక్ష రాసే అభ్యర్థులు సూచనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, దీనికి 6,729 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల గురించి, హాల్ టికెట్ డౌన్ లోడ్ గురించి జిల్లా స్థాయి హెల్ప్ లైన్ నెం. 9491053677 కు సంప్రదించ వచ్చునని సూచించారు. హాల్ టికెట్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌పీఎస్‌సీ.గావ్. ఇన్‌వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని, అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్ష హాలునుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించబడరని, పరీక్ష హాలును వదలి వెళ్లే ముందు, అభ్యర్థి ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందజేయాలని అన్నారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా అభ్యర్థి తన బయోమెట్రిక్‌ను క్యాప్చర్ చేసే వరకు పరీక్ష హాలు నుంచి బయటకు అనుమతించబడరని, అభ్యర్థి ఎవరైనా తన బయోమెట్రిక్‌ను ఇవ్వకపోతే వారి ఓఎంఆర్ ఆన్సర్ షీట్ మూల్యాంకనం చేయబడదని తెలిపారు.



నిమిషం నిబంధన అమలు..

చేతులకు మెహంది, టాటూలతో పరీక్షకు వెళ్లకూడదని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూ, సాక్స్ ధరించరాదని, కేవలం చెప్పులు మాత్రమే ధరించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశించడానికి ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని, ఉదయం 10 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైననూ పరీక్ష హాలు లోనికి అనుమతించబడరని, పరీక్ష కేంద్రం మెయిన్ గేట్ ఉదయం 10గంటలకు మూసివేయబడుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థికి ఒకవేళ చేతులు లేకపోతే సహాయకులు కావాలని ముందుగానే దరఖాస్తు చేసినవారికి మాత్రమే పరీక్ష కేంద్రం వారు స్క్రైబ్‌ను ఇస్తారని, అనుమతి లేకుండా ఎవరూ సహాయకులను తీసుకురాకూడదని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు కనీసం ఒకరోజు ముందుగా తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్షా కేంద్రం ఖచ్చితమైన ప్రదేశాన్ని తెలుసుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రంలోకి వాటర్ బాటిల్ అనుమతించరని పరీక్ష కేంద్రంవారే తాగునీటి సౌకర్యము కల్పిస్తారని, పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైలు ఫోన్‌లు, కాలిక్యులేటర్లు, చేతి గడియారాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, బ్లూటూత్ డివైస్‌లు, పెన్ డ్రైవ్‌లు, రైటింగ్ ప్యాడ్ లు, తెల్ల కాగితాలు అనుమతించబడవని, పరీక్ష కేంద్రం వద్ద వస్తువులు భద్రపరచడానికి కమిషన్ ఎలాంటి క్లోక్ రూమ్, స్టోరేజీ సౌకర్యం కల్పించలేదని అన్నారు. అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం, సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించబడుతుందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సూచనలు పాటించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్ రేంజ్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ రమాదేవి తెలిపారు. కాగజ్‌నగర్ రేంజి పరిధిలోని కడంబా గ్రామ శివారులో 2022-23 సంవత్సరంలో పెంచిన 25 హెక్టార్ల మండువా ప్లాంటేషన్స్‌లో గ్రామానికి చెందిన పలువురు మొక్కలు తొలగించారు. అదే సంవత్సరంలో నాటిన 20 హెక్టార్ల కదంబ ప్లాంటేషన్‌లో మొక్కలు తొలగించి కొంతవరకు అక్రమంగా అటవీ భూమిని దున్ని ప్లాంటేషన్ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఐదు గురిపై కేసు నమోదు చేయడం జరిగిందని, మిగతా వ్యక్తుల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వివరించారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానానిదే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానానిదేనని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కల్గించినా సీనియర్ సిటిజన్స్ పోషణ, పరిరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులని, అరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా ఉంటుందని పేర్కొన్నారు.